క్లుప్తంగా

దేవాలయానికి విరాళం అందజేత



విరాళాన్ని అందజేస్తున్న భక్తులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలోని గర్భాలయం ముఖ ద్వారానికి ఇత్తడి తొడుగు ఏర్పాటు చేసేందుకు నందిగామ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన పాకనాటి రాధ, శ్రీపతిరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన స్వప్న, దత్తు దంపతులు రూ.95,011ల విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళానికి సంబంధించిన నగదును వారు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, సాయిఈశ్వర్‌రెడ్డి, భూపాల్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

జోరువాన



కేశంపేటలో ఓ ఇంట్లోకి చేరిన వర్షపునీరు

కేశంపేట: మండలంలో సోమవారం జోరు వాన కురిసింది. ఆయా గ్రామాల్లో కురిసిన వర్షాలకు వాగులు పొర్లడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కేశంపేటలో కురిసిన వర్షానికి మాజీ సర్పంచ్ తలసాని నారాయణరెడ్డి ఇంట్లోకి వర్షం నీరు చేరడంతో తొలగించడానికి నానా ఇబ్బందులు పడ్డారు.

కర్ణం కార్తీక్‌కు కీర్తిరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న కార్తీక్‌రావు

కొత్తూరు: కొత్తూరు పట్టణానికి చెందిన కర్ణం కార్తీక్‌రావు తాను చేసిన సామాజిక, సేవా కార్యక్రమాలను గుర్తించిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు కీర్తిరత్న అవార్డును ప్రదానం చేసినట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తన సేవలను గుర్తించి అవార్డు ప్రదానం చేయడం సంతోషకరమన్నారు. బీఎస్పీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్, మహబూబ్‌నగర్ జిల్లా కరాటే అధ్యక్షుడు రవికుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కొత్తూరు పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల్లోను సామాజిక, సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొందుర్గు: కొందుర్గు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్కావెంజర్‌గా విధులు నిర్వహించేందుకు ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిస్సీ షెకినా సోమవార ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాల, పరిసరాలను శుభ్రం చేయాల్సి ఉంటుందని, వేతనం నెలకు రూ.9,750 అందజేస్తామని వెల్లడించారు. 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి పనిచేయుటకు ఆసక్తి గల మహిళలు ఈ నెల 11వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

బీసీ ధర్నాకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత కోరారు. సోమవారం మార్కెట్‌యార్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, కానీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుందని ఆరోపించారు. అడ్డుకునేవారంతా చరిత్రలో బీసీ ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. రిజర్వేషన్ల బిల్లు అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు దేశ రాజధానిలో ధర్నా చేపట్టామని, కార్యక్రమానికి బీసీలు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయ



కొత్తూరు: చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సిబ్బంది

కొత్తూరు: తల్లిపాలతోనే శిశువు ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, శ్రీరామరక్షగా నిలుస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ ఉదయ అన్నారు. కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలతో శిశువులో సరైన ఎదుగుదల, రోగ నిరోధక శక్తితో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. తల్లిపాలకు దూరమైన చిన్నారుల్లో చిన్న వయస్సులోనే ఎన్నో అనారోగ్యాల బారినపడే అవకాశం ఉందన్నారు. తల్లిపాలలో ఉండే పోషకాలను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ తప్పకుండా చిన్నారులకు తల్లిపాలు పట్టించాలని సూచించినట్లు వివరించారు. పుట్టినరోజు నుంచి ఆరునెలల వరకు తప్పకుండా చిన్నారులకు తల్లిపాలు పట్టించాలన్నారు. దీంతో రొమ్ము కేన్సర్‌ను నియంత్రించవచ్చన్నారు. అనంతరం పెంజర్ల గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు దీప్తి, సూపర్‌వైజర్ రేవతి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీలు, పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

మొయినాబాద్: తల్లిపాలు బిడ్డకు అమృతమని.. మంచి పోషకాహారం అందించినప్పుడే చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని.. పుట్టిన రెండు నుంచి మూడు గంటల్లోపే తల్లిపాలు పట్టించాలన్నారు. ఆరునెలల వరకు బిడ్డకు కేవలం తల్లిపాలే ఇవ్వాలన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లి కూడా పోషకాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. దీనిపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

వసతి గృహానికి భవనం నిర్మించాలి

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్

చేవెళ్ల: కళాశాలలో చదువుకునే విద్యార్థినుల కోసం డివిజన్‌కు మంజూరైన కళాశాల వసతి గృహానికి సొంత భవనం నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. అక్కడే కొనసాగుతున్న కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థినుల కోసం మంజూరైన వసతి గృహానికి సరైన స్థలం భవనం లేకపోవటంతో పాఠశాల వసతి గృహంలోనే కొనసాగిస్తున్నారన్నారు. ఇక్కడ కళాశాల విద్యార్థినులకు సరిపడా వసతులు లేకపోవటంతో విద్యార్థులు ఎక్కువగా చేరటం లేదన్నారు. కేవలం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 30 మంది మాత్రమే ఉన్నారని ఆరోపించారు. సరైన భవనం లేకపోవటంతో కొత్తగా విద్యార్థినుల అడ్మిషన్లు ప్రారంభించలేదన్నారు. వెంటనే కళాశాల విద్యార్థులకు ప్రత్యేక భవనం కేటాయించాలని.. అలాగే నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా నేటికీ ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని ప్రారంభించకుండా.. పాఠశాల వసతి గృహంలో కేవలం ద్వితీయ సంవత్సరం మాత్రమే కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి కళాశాల సొంత వసతి గృహం భవన నిర్మాణం చేపట్టాలని, అప్పటివరకు ప్రైవేట్ భవనం అద్దెకు తీసుకొని కళాశాల వసతి గృహాన్ని కొనసాగించాలన్నారు. లేకపోతే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు పవన్‌కుమార్, రాము, రిషి తదితరులు ఉన్నారు.



వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రామేశ్వరం రహదారికి మరమ్మతులు చేయండి


షాద్‌నగర్: మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా నుంచి రామేశ్వరం వరకు ఉన్న బీటీరోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందని.. మరమ్మతులు చేయాలని బీజేపీ నేత, న్యాయవాది కాసోజు శివకుమార్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రామేశ్వరం రహదారి పూర్తిగా గుంతలుగా మారడంతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ప్రతి రోజు రామేశ్వరంలో ఉన్న ప్రసిద్ధి చెందిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్తుంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర కలశాభిషేకం



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని కనకమామిడి సంగమేశ్వర దేవాలయంలో శ్రావనమాసం రెండో సోమవారం శివలింగానికి 1101 కలశాలతో సహస్ర కలిశాభిషేకం నిర్వహించారు. స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ఆవరణ శివనామస్మరణతో మార్మోగింది. నిర్వాహకులు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.



అభిషేకం నిర్వహిస్తున్న మహిళలు

రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



నర్సప్పగూడలో కేంద్ర పథకాలపై వివరిస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

నందిగామ: రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. పెన్షన్లు పెంచుతామని, మహిళలకు నెలకు రూ.2,500లు కానుకగా ఇస్తామని, విద్యార్థులకు ఇస్తామన్న స్కూటీలు ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. గతంలో ఉన్న బీఆర్‌ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ రెండూ రెండేనని ఆరోపించారు. ప్రధాని మోదీ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరాలంటే రాబోయే స్థానిక ఎన్నికలలో గ్రామ గ్రామాన బీజేపీనే గెలిపించాలని సూచించారు. బీజేపీతోనే గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు వివరిస్తూ.. ఆ కరపత్రాలను ఇంటింటికీ అతికించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్కిరాల నర్సింహ, హేమంత్, లక్ష్మణ్‌గౌడ్, అశోక్, ప్రభాకర్ చారి,సత్యం, నక్కల అశోక్, విక్రాంత్, వెంకటేశ్, జంగయ్య, వజ్రం, గ్రామస్తులు వెంకయ్య,వెంకటయ్య, సత్తయ్య, వితలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పీఏసీఎస్ ముడిమ్యాల చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవరంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల 1వేయి, తంగడపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.51వేలు, న్యాలట గ్రామంలో చర్చి నిర్మాణానికి 1.60లక్షల రూపాయల విరాళాలను సోమవారం ఆయన జన్మదినం సందర్భంగా ఆయా గ్రామస్తుల సమక్షంలో కమిటీల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి బాటలో కొనసాగుతున్నాయన్నారు. మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందేలా చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కట్టుబడి ఉంటామన్నారు. అనంతరం ఆయనకు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దేవరంపల్లి, తంగడపల్లి, న్యాలట గ్రామాలకు చెందిన గ్రామపెద్దలు, నాయకులు, తదితరులు ఉన్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న పీఏసీఎస్ ముడిమ్యాల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

సీపీఐ జిల్లా కమిటీ సభ్యుల ఎన్నిక



సుధాకర్‌గౌడ్, కౌన్సిల్ సభ్యుడు



సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు

చేవెళ్ల: సీపీఐ నూతన జిల్లా కమిటీలో మండలానికి చెందిన ఇద్దరికి అవకాశం లభించింది. సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా చేవెళ్లకు చెందిన వడ్ల సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా సుధాకర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం చేవెళ్లలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పార్టీ జిల్లా 17వ మహాసభలలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ జిల్లా కమిటీలో పట్టణానికి చెందిన తమకు అవకాశం కల్పించిందని, తమపై నమ్మకంతో అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల కొరత సృష్టించొద్దు

మండల వ్యవసాయాధికారి అనురాధ

మొయినాబాద్: రైతులకు అవసరమైన ఎరువులను డీలర్లు అందుబాటులో ఉంచాలని.. కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బంది పెట్టొద్దని మండల వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. మున్సిపాలిటీలోని ఫర్టిలైజర్ షాపుల్లో సోమవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి ఎరువుల స్టాక్ ఎంత ఉంది అనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న ఎరువులను రైతులు ఎప్పుడు అడిగినా విక్రయించాలని.. కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. మొయినాబాద్‌లోని వివిధ షాపుల్లో 71.865 మెట్రిక్ టన్నుల యూరియా, 15 టన్నుల డీఏపీ, 18.1 టన్నుల ఎస్‌ఎస్‌పీ, 5.8 టన్నుల ఎంఓపీ, 65.6 కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు సరిపడా ఎరువులు ఉన్నాయని.. ఎరువులకోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారి అనురాధ

లాలపేట వాగుకు వంతెన నిర్మించాలి



లాలపేట వాగును పరిశీలిస్తున్న నాయకులు

కొందుర్గు: మండలంలోని లాలపేట వాగుకు వంతెన నిర్మించాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పలువురు నాయకులతో కలిసి ఆయన వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షం కురిస్తే వరదనీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, దీంతో గ్రామస్తుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. వర్షాకాలంలో వరదనీటి ఉధృతికి గ్రామాల్లోని వాగులు పొంగిపొర్లుతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో పొలాలకు వెళ్లిన రైతులు తిరిగి ఇళ్లకు చేరేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. కొందరు రైతులు ప్రాణాలకు తెగించి వాగుదాటే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వాగుకు వంతెన నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌చారి, నాయకులు వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, భూపాల్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి

షాబాద్: విద్యుత్ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికల్లో రైతులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో విద్యుత్ సమస్యలు తిష్ట వేశాయన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల నాంధార్‌ఖాన్‌పేట్‌లో మేకల మహేందర్ అనే రైతు గేదె విద్యుత్ ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. అందుకు విద్యుత్ సంస్థ నుంచి నష్టపరిహారం అందిచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సతస్యనారాయణ రెడ్డి, సభ్యులు చంద్రయ్యగౌడ్, నరసింహారెడ్డి, కృష్ణ, ఒగ్గు మల్లేష్, చెన్నయ్య, రవీందర్‌రెడ్డి, గౌతమ్, సత్యంగౌడ్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

కొత్తూరు: ఆధ్యాత్మికత అలవర్చుకునే వారికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సిద్ధాపూర్‌లో నూతనంగా నిర్మించిన మైసమ్మ ఆలయ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని కోరారు. దైవమార్గంలో నడిచే వారు సాటివారి పట్ల ప్రేమానురాగాలతో మెలుగుతూ ఇతరులకు సాయం చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డి, జంగయ్య, శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్, కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అవసరం

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమని ఎంఈఓ మనోహర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో గల ఇండియన్ హైట్స్ పాఠశాలలో చైర్మన్ భువనేశ్వర్ ఆధ్వర్యంలో క్యాబినేట్ ఎన్నికలు నిర్వహించారు. హెడ్‌బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్లు, స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులను ఎన్నుకునేందుకు నిర్వహించిన ఎన్నికలలో విద్యార్థులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాల కౌన్సిల్ ఎన్నికలు విద్యార్థుల జీవితాల్లో ఒక ముఖ్యమైన భాగమన్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి స్టూడెంట్ కౌన్సిల్ నియామకం ఒక వేదికగా నిలుస్తుందన్నారు. ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మిషన్ భగీరథ నీటిని అన్ని కాలనీల్లో ఇంటింటికీ సరఫరా అయ్యే విధంగా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని శివారు కాలనీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. కాలనీల్లో పర్యటించినప్పుడు మహిళలు ప్రధానంగా మంచినీరు సరఫరా కావడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా పైపులైన్ లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సమస్యల పరిష్కార విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు.

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణగా మార్చేందుకు చర్యలు

డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఈడెన్ ప్లాజా ఫంక్షన్ హాల్‌లో యూనైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దందా నడిచిందని, నాయకులు, సెలబ్రిటీలు సైతం డ్రగ్స్‌కు బానిసయ్యారన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు వ్యతిరేఖంగా ఉద్యమించాలన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించే బాధ్యత పౌరులపై ఉందన్నారు. సమావేశాల్లో యాంటి నార్కొటిక్ బ్యూరో సీతారాం, డీఎస్పీ సైదులు, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులతో సమీక్ష

మండల పరిధిలోని లింగారెడ్డిగూడలో ఉన్న ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పరిష్కరించాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారంలో అధికారులు వేగం పెంచాలని, సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్, తదితర దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. మీ సేవా కేంద్రాల ద్వారా వచ్చే జనన, మరణ, ఆదాయ, స్థానిక తదితర ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడూ జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీఓ సరిత, తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్